- మంత్రి కేటీఆర్ రోడ్‌షోలతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం
- భరోసానిస్తున్న రామన్న ప్రసంగం
- అభివృద్ధిని చూసి మరోసారి ఆశీర్వదించాలని పిలుపు
- తంగళ్లపల్లి, ముస్తాబాద్, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేటలో రోడ్‌షోలు గ్రాండ్ సక్సెస్
- 'మేమంతా రామన్న వెంటే' అంటున్న ప్రజానీకం
- మరోసారి కేటీఆర్‌కే పట్టంకడుతామంటూ వెల్లడి

# కారు టాప్‌గేర్

## ప్రచారంలో దూసుకుపోతున్న బీఆర్‌ఎస్



గంభీరావుపేట మండల కేంద్రంలో నిర్వహించిన రోడ్‌షోకు పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తున్న సిరిసిల్ల బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి కేటీఆర్

సిరిసిల్ల, నవంబర్ 27: సిరిసిల్ల నియోజకవర్గంలో బీర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి కేటీఆర్ ఎన్నికల ప్రచారం జోరందుకున్నది. ఇదివరకే గ్రామాల్లో బీఆర్‌ఎస్ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. అలాగే మంత్రి కేటీఆర్ సైతం రోడ్‌షోల ద్వారా తొమ్మిదిన్నర ఏండ్లలో రాష్ట్రంలో జరిగిన ఆదర్శమైన అభివృద్ధిని వివరిస్తూనే, ప్రతిపక్షాలు వస్తే ఏమవుతుందో అవగతం చేస్తున్నారు. సుస్పష్టంగా కేసీఆర్ పాలనను ప్రజల మదిలో నింపుతున్నారు. రోడ్‌షోలలో అన్ని గ్రామాల పేరును సంబోధించడం ప్రజల్లో చైతన్యం నింపుతున్నారు. ఈ నెల 15న తంగళ్లపల్లి, 20న ముస్తాబాద్, 26న వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట మండలాల్లో నిర్వహించిన కేటీఆర్ రోడ్‌షోలు నిర్వహించగా, రామన్న ప్రసగం ప్రజలను ఆకట్టుకున్నది. అలాగే ఈ నెల 28న సిరిసిల్ల పట్టణంలో నిర్వహించే రోడ్‌షోకు అమాత్యుడు హాజరుకానున్నారు. ఈ రోడ్‌షోలకు ప్రజల నుంచి విశేష స్పందన రావడంతో ప్రతిపక్షాల ఆశలు గల్లంతవుతున్నాయి. ప్రచారంలో భాగంగా స్థానిక సమస్యలను ప్రస్తావిస్తూనే.. పరిష్కరిస్తామనే హామీని ఇస్తూ ప్రజల్లో భరోసా నింపుతున్నారు. ప్రతి రోడ్‌షోల్లో ప్రజలు మంత్రి కేటీఆర్‌కు నీరాజనం పలుకుతున్నారు. పెద్ద ఎత్తున తరలిరావడంతో భవంతులు సైతం ఎక్కిమరీ రామన్న ప్రసంగాన్ని వింటున్నారు. రోడ్‌షోలు ముగిసిన తర్వాత ప్రజల్లో అభివృద్ధిపై చర్చ జరుగుతున్నది. గింతకంటే ఇంకేమీ చేస్తారని, మనసున్న రామన్నను వదులుకోమంటూ వెల్లడిస్తామన్నారు.

### అభివృద్ధిని వివరిస్తూ.. స్థానిక అంశాలకు ప్రాధాన్యమిస్తూ..

మంత్రి కేటీఆర్ నాలుగు మండలాల్లో నిర్వహించిన రోడ్‌షోలలో స్థానిక అంశాలను ప్రస్తావించారు. అలాగే జరిగిన అభివృద్ధిని వివరిస్తూ, ప్రత్యర్థులపై పంచ్‌లు, సెటైర్లు వేస్తూ ప్రజలను ఆకట్టుకున్నారు. తంగళ్లపల్లిలో ఈ నెల 15న నిర్వహించిన రోడ్‌షోలో మంత్రి కేటీఆర్ ప్రసంగం ప్రజల్లో భరోసా నింపింది. నాడు నీళ్ల కోసం కోట్లాడిన మండలవాసులకు సిరిసిల్ల–తంగళ్లపల్లి వంతెన కింద శాశ్వతంగా నీరు ఉందని వివరించారు. నాడు ఎట్లుండే.. నేడు ఎట్లయిందంటూ.. జరిగిన అభివృద్ధిని ప్రజలతోనే చెప్పించారు.

### ఎడ్యుకేషన్ హబ్‌గా సిరిసిల్ల

సిరిసిల్ల ఎడ్యుకేషన్ హబ్‌గా మారిందని మంత్రి కేటీఆర్ తెలిపారు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలో వ్యవసాయ కళాశాల, అగ్రికల్చరల్ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేశామన్నారు. త్వరలో తంగళ్లపల్లి వరకు రైలు వస్తుందని హామీఇచ్చారు. ఈ ప్రాంత యువకులతో కోసం అప్పారెల్ పార్కును ఏర్పాటు చేసి, దాదాపు ఐదు వేల మందికి ఉపాధి కల్పిస్తామని ప్రకటించారు. చీర్లవంచలో దాదాపు మూడు వందల ఎకరాల్లో దేశంలో ఎక్కడా లేనివిధంగా అక్వాహబ్‌ను ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. తంగళ్లపల్లి మండలంలో చేసిన అభివృద్ధి మీ కండ్ల ముందే ఉందని.. మరోసారి ఆశీర్వదించాలని కోరారు. స్థానిక సమస్యలను పరిష్కారిస్తామని హామీఇచ్చారు.

### భరోసానిచ్చిన రామన్న ప్రసంగం

ముస్తాబాద్‌లో వచ్చే జనవరి లేదా ఫిబ్రవరిలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తామని మంత్రి కేటీఆర్ తన రోడ్‌షోలో ప్రకటించారు. ఇప్పటికే ముస్తాబాద్‌లో 30పడకల దవాఖాన మంజూరు చేయగా, నిర్మాణంలో ఉందని తెలిపారు. ముస్తాబాద్ మండలంలోని చెరువులన్నీ జలకళతో ఉట్టిపడుతున్నాయని.. బడులు బాగు చేసుకున్నామని, పెద్దబడి సర్వాంగ సుందరంగా ముస్తాబవుతుందని చెప్పారు. మల్లన్న సాగర్ జలాలను కాలువల ద్వారా బంధనకల్‌కు తీసుకువస్తామని స్పష్టం చేశారు. అలాగే నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టు మండుటెండల్లోనూ మత్తడి దుంకుతున్నదని, రైతులకు పుట్లకొద్దీ వడ్లు పండుతున్నాయని వివరించారు.

### 'పోడు' సమస్యలు పరిష్కరిస్త..

వీర్నపల్లిలో మండలంలోని పోడు భూముల సమస్యలు పరిష్కారిస్తామని మంత్రి కేటీఆర్ రోడ్‌షోలో ప్రకటించారు. ప్రతీ గ్రామానికి సేవాలాల్ మహారాజ్ భవనాన్ని, మండల కేంద్రంలో బంజారా భవనాన్ని మంజూరు చేస్తామని తెలుపడంతో తండావాసుల్లో ఆనందంనింపింది. ప్రతి గ్రామానికి కార్పొరేట్ స్థాయిలో బడులను నిర్మిస్తామని ప్రకటించారు. వీటితోపాటు లావాణీ పట్టాల భూములపై పట్టాలు అందిస్తామని తెలుపడంతో సంతోషించారు. తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిన ఘనత కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు.

### ఎల్లారెడ్డిపేటను కోనసీమగా మారుస్తా..

ఎల్లారెడ్డిపేటను కోనసీమగా మారుస్తానని మంత్రి కేటీఆర్ ప్రకటించడంతో ఈ ప్రాంత రైతులు సంతోషం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల మంజూరు చేస్తామని, ఇందు కోసం రూ.40లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. వృత్తి విద్య నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని, మల్కపేట రిజర్వాయర్ నుంచి కాలువల ద్వారా సింగసముద్రం చెరువును నింపుతామని తెలిపారు. ప్రతి గ్రామంలో మహిళా సంఘ భవనాలను నిర్మిస్తామని ప్రకటించారు

### 'కేజీ టూ పీజీ'లో హాస్టల్ వసతి కల్పిస్తాం

గంభీరావుపేట మండలం నర్మాలలో ఎగుమానేరు జలాశయంలో పూడికతీసి, రెండు టీఎంసీలు నిండేలా చూస్తామని మంత్రి కేటీఆర్ భరోసానిచ్చారు. కేజీ టూ పీజీ విద్యార్థులకు హాస్టల్ భవన నిర్మాణం చేపడుతామని ప్రకటించారు. అలాగే గంభీరావుపేటలో సబ్ ట్రెజరీ నిర్మాణం, సింగసముద్రం నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా సముద్రాలింగాపూర్, గజసింగవరం, గోరంట్యాలకు నీరు అందిస్తామని వెల్లడించారు.

### కాంగ్రెస్ వెంటే కష్టాలు..

కాంగ్రెస్ పార్టీ నేతలకు వ్యవసాయం మీద అవగాహన లేక అజ్ఞానం మాటలు మాట్లాడుతున్నారని, 10హెచ్‌పీ మోటర్లతో, మూడు గంటల కరెంటు ఇస్తామంటూ ప్రకటించడం వారి అవగాహన రాహిత్యానికి నిదర్శనమని మండిపడ్డారు. మూడు గంటల్లో 10హెచ్‌పీ మోటర్లతో ఎంత పొలంపారుతుందో మీరే చెప్పాలన్నారు. పలు రోడ్‌షోలో ఎంత మంది రైతులు 10హెచ్‌పీ మోటర్లు వాడుతున్నారని మంత్రి కేటీఆర్ అడుగగా, ఎవరూ లేరని సమాధానమిచ్చారు. కాంగ్రెస్ నేత ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రైతుబంధు వద్దని, భట్టివిక్రమార్క ధరణి పోర్టల్‌ను తొలగించి పట్వారీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని అనడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పాలనే దరిద్రమని, 11సార్లు వాళ్లకు చాన్స్ ఇచ్చిన ఏం చేయనోళ్లు ? ఇప్పుడొచ్చి ఏం చేస్తారని ప్రశ్నించారు.

### మతం పేరుతో పార్టీలు

మరో పార్టీ మతంపేరుతో మోసం చేయాలని చూస్తున్నారని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కేటీఆర్ పలు రోడ్‌షోలో సూచించారు. పెంచిన గ్యాస్ సిలిండర్ ధరను మదిలో పెట్టుకొని ఆ పార్టీని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. మోదీ ప్రతి ఖాతాలో డబ్బులు వేస్తానని మరిచిపోయాడని గుర్తు చేశారు. బీజేపీ ఎంపీ బండి సంజయ్ నియోజకవర్గానికి ఏం చేశాడని ప్రశ్నించారు. రెచ్చగొట్టడమే ధ్యేయంగా మాట్లాడుతున్నాడని, యువత జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

### నేను మీరు పెంచిన బిడ్డను..

నాకు జన్మనిచ్చింది నా తల్లి.. రాజకీయ జన్మనిచ్చింది సిరిసిల్ల ప్రజలు.. అంటూ పలు సభల్లో మంత్రి కేటీఆర్ చెబుతున్నారు. మీరు ఇచ్చిన ఈ అవకాశంతో నాకు ప్రపంచ వ్యాప్త గుర్తింపు లభించిందని వెల్లడిస్తున్నారు. మీ దయతో ఎమ్మెల్యేగా, సీఎం కేసీఆర్ ఆశీస్సులతో మంత్రిని అయ్యానని పేర్కొన్నారు. మీకు సేవ చేస్తున్నా. ఇంకా ఎంతో చేయాలని ఉందంటూ వివరించారు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా నాకు సిరిసిల్ల ఎమ్మెల్యేగానే మీరు ఇచ్చిన గుర్తింపు ఉందన్నారు. తొమిదిన్నర ఏండ్లలో మీరు గర్వపడేలా అభివృద్ధి చేశానని.. ఎక్కడా తలదించుకునేలా చేయలేదని.. బాధ్యతలు పెరగడం వల్ల రాష్ట్రమంతా ప్రచారం చేయాల్సి వస్తున్నదన్నారు. ప్రతి ఒక్కరినీ కలువాలని, ప్రతీ గ్రామానికి రావాలని ఉందన్నారు. ప్రతి ఇంటికీ వచ్చినట్లే భావించాలని, ఆగం కాకుండా.. కారు గుర్తుకే ఓటేసి మరోసారి గెలిపించాలని కోరారు.

**- మంత్రి కేటీఆర్**

### మ్యానిఫెస్టో వివరిస్తూ..

జనవరిలో కొత్త రేషన్‌కార్డులు, కొత్త పింఛన్లు అందిస్తామని మంత్రి కేటీఆర్ ప్రకటించారు. అత్తలకు ఆసరా పింఛన్లు ఇస్తుండగా, కొడండ్లు కోపంగా ఉన్నారని.. వారికి కూడా అధికారంలోకి రాగానే సౌభాగ్యలక్ష్మి ద్వారా నెలకు రూ.3వేలు అందిస్తామని ప్రకటించారు. ఆసరా పింఛన్‌ను దశలవారీగా ₹5వేలు పెంచుతామని వెల్లడించారు. రైతు బంధు ₹10వేల నుంచి ₹16వేలకు పెంచుతామని చెప్పారు. ₹400కే సిలిండర్ అందిస్తామని ప్రకటించారు. తెలుపు రేషన్‌కార్డు దారులకు సన్న బియ్యం పంపిణీ, ₹5 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తామని, గల్ఫ్‌లో నివసించే వారికి ప్రత్యేక ప్యాకేజీ అమలు చేస్తామని ప్రకటించారు.

### అభివృద్ధే నా కులం.. సంక్షేమమే నా మతం..

ఎన్నికలు రాగానే కులం మతం పుట్టుకొస్తున్నాయని మంత్రి కేటీఆర్ పలు రోడ్‌షోలో ఆరోపించారు. ఒక పార్టీ కులంతో, మరో పార్టీ మతం ప్రజల్లోకి వస్తున్నారని ఆరోపించారు. కులం, మతం కాదని అభివృద్ధిని చూడాలని కోరారు. అభివృద్ధే నా కులమని.. సంక్షేమమే తన మతమని వెల్లడించారు. కులం, మతంపేరుతో వచ్చే వారు ఇన్నేండ్లు ఎక్కడున్నారంటూ ప్రశ్నించారు. కులం, మతం కాకుండా నిరంతరంగా మీ కోసమే పని చేసే తనను గెలిపించాలని ఓటు అభ్యర్థించారు.

### బీఆర్‌ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం..

మంత్రి కేటీఆర్ నియోజవర్గంలో నిర్వహించిన రోడ్‌షోలతో బీఆర్‌ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం వచ్చింది. ఇప్పటికే బూత్‌ల వారీగా ప్రచారం నిర్వహిస్తున్న కార్యకర్తలకు రోడ్‌షోలతో మంత్రి కేటీఆర్ బూస్ట్‌నిచ్చారు. ఎక్కడికి వెళ్లిన కేటీఆర్‌కే మా మద్దతు అంటున్నారని అన్నివర్గాల ప్రజలు చెబుతున్నారు. అఖండ మెజార్టీతో రామన్న విజయం సాధించడం తథ్యమని పేర్కొంటున్నారు.



రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నిర్వహించిన వీసీకి కలెక్టరేట్ నుంచి హాజరైన జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి

# పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి

- ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో మోడల్ పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- పోలింగ్ అనంతరం ఈవీఎం యంత్రాల తరలింపునకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్

కలెక్టరేట్, నవంబర్ 27: జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, ముఖ్య ఎన్నికల అధికారులు రాష్ట్ర శాసనసభకు జరగబోయే సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తో కలిసి పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నిర్వహణ, ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, రిసెప్షన్ కేంద్రా ల ఏర్పాటు, ఈవీఎంల తరలింపు, కౌంటింగ్ ఏర్పాట్లు తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో మాట్లాడుతూ... ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పోలింగ్ నిర్వహణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆయా నియోజకవర్గాల పరిధిలో రిటర్నింగ్ అధికారులు సైలెన్స్ పీరియడ్‌లో పాటించాల్సిన నిబంధనలపై రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులకు సమాచారం అందించాలన్నారు. పోలింగ్ అనంతరం స్ట్రాంగ్ రూమ్‌కు ఈవీఎంల తరలింపు కోసం అవసరమైన వాహనాలను సిద్ధం చేయాలన్నారు. పోలింగ్ రోజు సిబ్బంది సకాలంలో కేంద్రాలకు చేరుకుని, మాక్ పోల్ నిర్వహించాలన్నారు. కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ నిర్వహించాలని, జిల్లాలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పోలింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలన్నారు.